# లక్షద్వీప్ దీవుల్లో పోరాడుతున్న ప్రజలకు సంఘీభావంగా నిలుద్దాం

**లక్షద్వీప్** పాలనాధికారి అయిన ప్రఫుల్ ఖోడా పటేల్ తీసుకుంటున్న అప్రజాస్వామిక, ప్రజావ్యతిరేక నిర్ణయాల కారణంగా అక్కడి దీవుల్లో అశాంతి వాతావరణం నెలకొంది. దీనిని వ్యతిరేకించిన అనేకమంది పై నిర్బంధం ప్రయోగిస్తున్నారు. అనేక మంది ప్రజలపై లాఠీఛార్జీ చేసి, అరెస్ట్ చేస్తున్నారు.

అరేబియా సముద్రతీరంలో ఉన్న భారత దేశపు దీవుల్లో లక్షద్వీప్ కూడా ఒకటి. 36 చిన్న చిన్న దీవుల సముదాయం ఇది. వీటిలో పది దీవుల్లోనే ప్రజలు నివసిస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం అక్కడ జనాభా 64,473 మంది. అందులో 94.8 శాతం షెడ్యూల్డ్ జాతులు, వీరంతా ముస్లింలే. అత్యధికులు మాట్లాడే భాష మళయాళం. అక్షరాస్యత 92%. చేపల వేట, కొబ్బరిసాగు ప్రధాన వృత్తులుగా ఉన్నాయి. లక్షద్వీప్ ఒక జిల్లా హోదా కలిగి వుండి, ఒక పార్లమెంట్ స్థానం, పది దీవులకు పది గ్రామ పంచాయితీలు ఉన్నాయి. ఈ దీవులలో ప్రఫుల్ పటేల్ తన విధానాలతో కార్చిచ్చు రాజేశాడు.

పటేల్ లక్షద్వీప్‌లో అధికారం చేపట్టిటన దగ్గరన్నుండి దీవుల్లో అశాంతి, అసహనాలు రేకెత్తేవిధంగా ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ, ఒంటెత్తు పోకడలతో వ్యవహరిస్తున్నారు. ఈయన చేసిన చట్టాలలో లక్షద్వీప్ డెవలప్‌మెంట్ అథారిటీ రెగ్యులేషన్ యాక్ట్ ఒకటి. దీని ప్రకారం అభివృద్ధి పేరుతో ప్రభుత్వం ఏ భూమినైనా, ఎవరి భూమినైనా స్వాధీనం చేసుకునే హక్కు ఉంటుంది. ఈ దీవుల్లో పర్యావరణ విధ్వంసానికి గేట్లు బార్లా తెరుస్తూ మైనింగ్, గనుల తవ్వకాలు, భవన నిర్మాణాలకు, జాతీయ రహదారులు , రింగ్ రోడ్డులు, విమానాశ్రయాలకు అనుమతించారు. భారత దేశంలో సెజ్‌ల పేరుతో భూములు స్వాధీనం చేసుకుని, భూములు కోల్పోయిన వాళ్ళకు "సెక్యూరిటీ గార్డు" ఉద్యోగాలు ఇచ్చినట్టుగా.. ప్రజల ఉపాధి కోసం పరిశ్రమలు పెడతా మంటున్నారు. అలాగే కోస్టల్ రెగ్యులేషన్ జోన్ కోస్ట్ గార్డ్ యాక్ట్ పేరు చెప్పి సముద్ర తీరంలో జాలర్లు వేసుకున్న గుడిసెలను, షెడ్లును, వలలను, బోట్లను అధికారులు నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారు. జంతు పరిరక్షణ నియంత్రణ చట్టం పేరుతో పశుమాంసం ప్రధాన ఆహారంగా ఉన్న చోట బీఫ్, బీఫ్ ఉత్పత్తుల క్రయ, విక్రయాలను నిషేధించారు. టూరిజం డెవలప్‌మెంట్ పేరుతో ఈ దీవుల్లో మద్యం అమ్మకాలపై వున్న నిషేధాన్ని ఎత్తివేశారు. హోటళ్ళు, రిసార్టులు నిర్మించి టూరిజం అభివృద్ధి చేసేందుకు అంబానీ, అదానీ కంపెనీలను ఆహ్వానిస్తున్నారు.

అంతేకాకుండా అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే హైస్కూల్‌లో పనిచేస్తున్న 200 మంది కాంట్రాక్ట్ టీచర్లను, కొంత మంది అంగన్‌వాడీలను తొలగించారు. ఆ చర్యలను వ్యతిరేకిస్తూ విద్యార్థులు పెద్ద ఎత్తున ఎస్ఎంఎస్ క్యాంపెయిన్, సోషల్ మీడియాలో ప్రచారం చేసి.. ఆందోళన చేస్తే వారిపై లాఠీఛార్జీకు పాల్పడి, అక్రమంగా అరెస్ట్ చేశారు. టూరిజం శాఖలో పనిచేసే 190 మంది ఉద్యోగులను తీసేశారు. స్థానిక భాష మళయాళం మాట్లాడే సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ మరియు ఇతర అధికారుల్ని విధుల నుండి తొలగించి, గుజరాత్ నుండి హిందీ మాత్రమే మాట్లాడే అధికారుల్ని నియమించారు. అలాగే గ్రామ పంచాయితీ అధికారాలను తగ్గిస్తూ, వాటి మీద అజమాయిషీ చెలాయించడం, స్థానిక ప్రభుత్వం నిర్వహిస్తున్న పాల కేంద్రాలను మూసివేసి గుజరాత్ అమూల్ కంపెనీకి అనుమతివ్వడం, ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులపై నిబంధనలు విధించడం... యిలా అనేక ప్రజావ్యతిరేక చర్యలు పటేల్ చేపట్టారు. ఈ చర్యలను నిరసించే,

వ్యతిరేకించే ప్రజల్ని "ప్రివెన్షన్ ఆఫ్ యాంటీ-సోషల్ యాక్టవిటీస్" అనే పేరుతో కారణాలు చెప్పకుండా ఎవరినైనా అరెస్ట్ చేసి, ఒక ఏడాది జైల్లో పెట్టే విధంగా ఒక గూండా చట్టానికి రూపకల్పన చేసారు.

ఒకప్పుడు సివిల్ కాంట్రాక్టర్ అయిన ప్రఫుల్ పటేల్ రాజకీయ జీవితాన్ని గమనిస్తే... మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో శాసనసభ్యులుగా (2007) ఎన్నికయ్యారు. సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసు (2010)లో నాటి రాష్ట్ర హోంమంత్రి అమిత్‌షా అరెస్టయినపుడు, ఆయన స్థానంలో ప్రఫుల్ పటేల్ మంత్రిగా నియమితులయ్యారు. తర్వాత నరేంద్రమోడీ ప్రధానిమంత్రిగా ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వం 2016లో పటేల్‌ను దాద్రా-నగర్ హవేలీ, డామన్ దీవులకు పాలనాధికారిగా నియమించింది. కేంద్రపాలిత ప్రాంతాల్లో ఐఏఎస్ అధికారులనే నియమించే సంప్రదాయాన్ని ఈయన కోసం పక్కన పెట్టింది. 2019 లోక్‌సభ ఎన్నికలపుడు దాద్రా-నగర్ హవేలీ కలెక్టర్, ఎన్నికల అధికారి కణ్ణన్ గోపీనాధన్‌తో పటేల్‌కు పొసగకపోవటంతో, చివరికి ఐఏఎస్ అధికారి రాజీనామా చేసే పరిస్థితి ఏర్పడింది. ఇదే కేంద్రపాలిత ప్రాంతం నుండి 7 సార్లు లోక్‌సభకు ఎన్నికైన మోహన్ డేల్కార్ ఆత్మహత్య చేసుకుంటూ రాసిన ఉత్తరంలో పటేల్ వేధింపులే తన మరణానికి కారణమని చెప్పారు. అయినా కేంద్ర ప్రభుత్వం నిరుడు జనవరిలో దాద్రా-నగర్ హవేలీ, డామన్ దీవులను విలీనం చేసి వాటి పాలనాధికారాలను, గత డిసెంబర్‌లో లక్షద్వీప్‌ను ఆయన చేతుల్లో పెట్టారు.

లక్షద్వీప్ ప్రజల ఆచార వ్యవహారాల దగ్గర నుండి భాష, సంస్కృతి, జీవనోపాధి, చివరకు తినే ఆహారం విషయంలో కూడా పాలనాధికారి జోక్యం ఉండటంతో అక్కడి స్థానిక ప్రజలకు తిరగబడటం తప్ప మరో మార్గం లేకుండా పోయింది. ప్రఫుల్ పటేల్ నిరంకుశ విధానాలను వ్యతిరేకిస్తూ "లక్షద్వీప్‌ను రక్షించండి!" అన్న నినాదంతో గత కొన్ని రోజుల నుండి నిరసనలు, నిరాహార దీక్షలు, ఇతర రూపాల్లో తీవ్రంగా పోరాడుతున్నారు. భారత భూభాగానికి దూరంగా ఉన్న చిన్న దీవుల్లోని ప్రజలు అక్కడి ప్రభుత్వ విధానాలకు, దమనకాండకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. లక్షద్వీప్ ప్రజల న్యాయమైన పోరాటానికి 'జనశక్తి' సంఘీభావం తెల్పుతోంది. లక్షద్వీప్ దీవుల్లో ఆందోళన చేస్తున్న ప్రజల సమస్యలను కేంద్రప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ప్రజావ్యతిరేక, నిరంకుశ విధానాలను అమలు చేస్తున్న ప్రఫుల్ పటేల్‌ను విధుల నుండి వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తోంది.